# అభాగిని

రచన
శ్రీమతి అకుండి జానకీదేవి

ప్రపంచకంలో ఎందరో నిర్భాగ్యులు, యింకెందరో అభాగినిలు కాలగతిలో గుర్తింపబడకుండా అణగారి పోయేరు. సానుభూతితో వారిని అర్థం చేసుకొని ఒక్క కన్నీటి బొట్టు రాల్చి వారి ఆత్మకు శాంతి కలిగించుట మానవ ధర్మం—

హోరున గాలి వీస్తున్నది. కుండపోతగా వర్షం పడుతున్నది. ఆకాశమంతా నల్లని మబ్బులతో కటిక చీకటిగావుంది. ఉండుండి పెద్ద మెరుపులు, వాటి వెనకనే భయంకరముగా గర్జిస్తూ చెవులు బ్రద్దలయే టట్లు చప్పుళ్ళతో పిడుగులుపడుతున్నాయి. ఆ రాత్రి ప్రళయం వస్తుందన్నట్లుగా వుంది. నక్కల కూతలు, కుక్కల అరుపులు, తీతుక పిట్టల రోదలు, విన్నవాళ్ళ గుండెలను చదరగొట్టేటట్లుగా వున్నాయి. అందరూ చలిచే గజగజ వణుకుటచే తలుపులు మూసుకొని నిద్రిస్తున్నారు. కాని సీత ఆ నిశిరాత్రి మిణుకు మిణుకుమంటూన్న దీపపు వెలుగులో చలికి గడగడ వణుకుచూ నిలువు గుడ్లతో ఒంటరిగా ఆ గుడిశలో రామయ్య మంచందగ్గర మూర్తీభవించిన శోకదేవతలా కూర్చొని వుంది. భీభత్సంగానున్న ఆ పిడుగులకన్నా ఒక్కొక్కప్పుడు రామయ్య మూలుగులే మరీ భయంకరంగా వున్నాయి. పాపం! సీతకు యివేమీ వినిపించనట్లులేవు. నిశ్చలంగా తన తండ్రి రామయ్యనే చూస్తూంది. అతి కష్టంతో రామయ్య గట్టిగా మూలుగుతూ 'సీతా!' అని పిల్చేడు. ఒక్కమాటు వులిక్కిపడి సీత బాహ్య ప్రపంచకంలోకి వచ్చి తండ్రిని సమీపించింది.

'ఏందయ్యా!'

'గంగడు వచ్చేడా తల్లీ?'

సీతకు ఏమిచెప్పాలో తోచలేదు. తండ్రి యిక అట్టే సేపు యీలోకంలో వుండడు. గంగడు రాలేదంటే తప్పకుండా తండ్రి బాధపడతాడు. కాని అబద్ధంచెప్పి తండ్రిని మోసగించలేదు. అందుచే చూస్తూ వూరుకుంది.

'రాలేదా తల్లీ!'

'లేదు' దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో నెమ్మదిగా చెప్పింది.

'నాకు తెలుసు, వాడురాడు. నీకు అన్యాయంచేశేను, నీకు దిక్కెవరు? రామయ్య కండ్లనుండి నీరు ఏకధారగా కారుతున్నది.

'అలా అనకయ్యా! నీకు నయమవుతాది'

'పిచ్చి పిల్లా! యింకెక్కడి నయం' అని నిట్టూర్చేడు, 'కొద్దిసేపట్లో నా జీవులు యీ బొంది లోంచి యెల్లిపోతాయి. తల్లి సచ్చినప్పటినుంచి పెంచి పెద్దచేసి నిన్ను ఆడి సేతిలోపెట్టినందుకు, ఎధవ, నీ కాలదసేకుం దున్నాడు.'

'అయ్యా, ఆయాసం వస్తుంది, ఊరుకో, యిప్పుడెందుకయన్న, ఇవుగో యీ నీళ్ళు కసిన్ని తాగి కళ్ళు మూసుకో, ఆదేవత్తాడు.' రామయ్య కొంచెం నీళ్ళుతాగి పడుక్కున్నాడు. సీతకు గడిచిన రోజులన్నీ ఒక్కొక్కటే తలపుకువచ్చేయి. 'తను యింకా చిన్న పిల్ల, అత్తయ్య దీనిని చూచినప్పుడల్లా, సిలకలాగుంటాది నా కోడలు అనేది.' అప్పుడు గంగడు బావ తనకన్న ఒక ఏడాది పెద్ద. పెద్ద ఆస్తి లేకపోయినా, అయ్యకు మంచిపేరుండేది. ఆ వూళ్లో సుబ్బయ్యగారి పొలం కవులుకి తీసుకొని నమ్మకంగా ఆరింట్లో చిన్న పనీ పెద్ద పనీచేసి అయ్య ఆలింటి మనిసిలా వుండేవాడు. అమ్మ ఆలింట్లో పాసిపనిచేసేది. తను వక్కర్తె అవడంవల్ల ఎంతో ముద్దుగా చూచేవాళ్లు. మాయదారి మహమ్మారి వచ్చి అమ్మ నెత్తుకుపోయింది. అప్పటినుంచి అయ్య మనసంతా పాడయిపోనాది. పనిమానేసి రోగిలా అయిపోయేడు. దయదల్చి సుబ్బయ్యగారు ఒక ఎకరం పొలం అయ్యకురాసి యిచ్చేరు. అదే సాగుచేస్తూ తనని పెంచేడు.'

'రామయ్యా! ఇలా ఎన్నాళ్లు బతుకుతావు. ముందు సూపు కాస్త సూసుకో సీతకి మనవైతే నీకేటి దిక్కు. బతుకంతా ముందునేవుంది. సచ్చినాళ్ళతో మనము సత్తామా! నా మాటవిను. అప్పలసామికూతురు అచ్చి లేదూ? ఇంటున్నావా! అప్పలసామి కూతురు అచ్చిని పెళ్ళి చేసుకో బంగారం నాంటి పిల్ల.'

'ఎంకటసామీ! ఏంది నీ వంటున్నది. నేను మళ్ళీ పెళ్ళి సేసుకోవాలా! అది యీ జన్మకులేదు. నారంగి ఎప్పుడైతేపోయిందో అప్పుడే నేను సచ్చిన్లో జమ. నా సీతకు అన్యాయం చేయను యిలాంటి మాటలు అనకు' అన్నాడు రామయ్య.

'నీ కర్మ, పెద్దోన్నికదా [illegible] సెప్పేను, ఆలోచించుకో, యిప్పుడు అలాగే వుంట[illegible] తేలాని తెల్దు అప్పటి బాధ.'

'నీ వెన్ని నాన్నా సెప్పుగాని, యీ యిసయం మరి సెప్పకు' అంటూ పైమీద పంచ దులుపుకొని లేచి పోయేడు రామయ్య. 'అప్పటినుంచి తల్లీతండ్రీ అయి తనే పెంచేడు. ఇంతలో ఆ తయ్య మొగుడు పోయి

(తరువాయి 23వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

కాకతో తను యింటికి వచ్చింది. అంతా కలసివుండే వాళ్లు. తనని అత్తయ్య పెద్దచేసింది. ఒక రోజు అనుకో కుండా అత్తయ్య కన్నుమూసింది. ఏంటో యీ సిత్రము. పుట్టినోళ్ళంతా ఎప్పుడో ఒక రోజు యిలాగే యెల్లి పోతారు. అంతా ఆ భగవంతుని మాయ. తనకు ఏమీ తెలీదు. అత్తయ్య సచ్చిపోయే ముందు అయ్యను పిల్చి గంగడిని అయ్య సేతిలో పెట్టి అల్లుడిగా సేసుకోమంది. అప్పటినుంచి అయ్యే పెంచి పెద్దసేసి తనని యిచ్చి పెళ్ళి సేసేడు, తన ముందరే పడివుంటాడని. ఇది జరిగి యిప్ప టికి పదేళ్ళయింది. కాని గంగడికి బుద్ధిలేదు. అంతా మర్చిపోయి అయ్యనే నానా మాటలు అంటాడు. మూడు రోజులయింది, కల్లు తాగివచ్చి, తనని చితక బాది యెల్లిపోయేడు, చీట్లాటలు యేశ్యాలు. ఇన్ని దుర్గుణాలున్న తన గంగడు కావ బాగుపడే దెప్పుడు? తన జీవితం యిలా యెల్లిపోవలసిందేనా?'

'మొదట్లో ఎంత బాగావుండేవాడు. సీతా! నీవు లేంది నేను బతకలేను, అమ్మ లేకపోయినా అమ్మకన్న యెక్కువగా పెంచేడు మామ' 'ఈ పపంచాన్నే మరిపి తున్నావు నువ్వు' అని తన దగ్గరగావచ్చి గబుక్కున ముద్దుపెట్టుకున్నాడు. 'ఛ...ఛ ..ఏటి! పాడు బుద్దులు. ఎవరైనా సూస్తే నవ్వుతారు' అంది బుంగమూతి పెడుతూ. 'ఎందుకే నవ్వుతారు, నేనేటి తప్పు శేశానని, కాకపోతే ఏంటీ మిట్ట మజ్జానం యీ ముద్దులు. ఓస్! అంతేకదా నా పెళ్లాన్ని ముద్దెట్టుకుంటే తప్పేటి – ఆ రోజున అలా అన్న బావేనా, యీ యాల యిలా మారి పోయాడు. తను చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన నిర్భా గ్యురాలు. తల్లికన్నా యెక్కువగా చూచే అత్తకూడ చచ్చిపోయింది. ఇప్పుడు తండ్రి పరిస్థితిచూస్తే యిలా వుంది. నమ్ముకున్న బావ మోసం సేత్తున్నాడు ఒక పెద్ద మెరుపు మెరిసింది. ఎక్కడో పిడుగుపడింది. కిటికీ తలుపులు తెరుచుకున్నాయి. గంగడు తూగుతూ వచ్చేడు. సీత పడిపోబోతూవున్న గంగడిని పట్టుకుంది.

'బావా! అయ్యనిసూడు, ఎలా పడివున్నాడో, నాకేటో భయంగావున్నాది. ఒక్కసారి డాకటేరుని తీసుకరా బావా! అంది ఏడుస్తూ' 'నన్ను ముట్టకేస్' అంటూ ఒక్క తన్ను తన్నేడు. ఆ తాపుకి సీత, రామయ్య మంచంమీద పడింది. రామయ్య కండ్లు విప్పి గంగడిని చూచేడు–కన్న కూతుర్ని చూచేడు. చిన్నప్పటి నుంచి ఒక్క దెబ్బయ్యకుండా తను, తన పెళ్ళాం పెంచేరు. ఆని ముత్తెంలాటి తన సీత తనజాతిలోనే పుట్టదు. అంతా అలానే అనేవారు. అలాంటి సీతను యీ కిరాతుడికిచ్చి తను అన్యాయం చేసేడు. చెల్లెలి మాట కాదనలేక మేనల్లుడు తన దగ్గరేవుంటారని నమ్మి యిచ్చేడు. తన సీత సుఖపడుతుం దనుకున్నాడు. కాని ...విధివైపరీత్యం అలా జరుగలేదు.

ఆవేశంలో లేని బలం తెచ్చుకొని ఒక్క వుదుటున లేచి గంగడి జుట్టుపట్టుకొని అక్కడే పడివున్న బండతో తలమీద కొట్టేడు. గంగడు దెబ్బ తప్పించుకొని, ఆ బండతోనే తిరిగి రామయ్య నెత్తిమీద బలంగా మొత్తేడు. దానితో రామయ్య కుప్పగాకూలి నేలమీద పడ్డాడు. లిప్తకాలంలో జరిగిని యీ సంఘటన చూచి సీత, 'అయ్యా!' అంటూ రామయ్యమీద వాలిపోయింది. ఎలా వచ్చేడో అదే దారిని గంగడు ఆ వానలో వెళ్ళి పోయేడు.

ప్రకృతి వీటితో తనకు నిమిత్తంలేనట్లు తన పని తాను చేసుకుంది. లోకాని కంతటికే తెల్లవారినా సీతకూ రామయ్యకూ మరి తెల్లవారలేదు.

♦



రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్ వారి "మిడతంభొట్లు" లో ఒక దృశ్యం.